

కిట్స్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2



2 మహిళలకు అహల్యాబాయి ఆదర్శం



న్యాయమూర్తికి సన్మానం 3

www.aksharatoday.com
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND




24-4-2025 (THURSDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-3





## నిప్పుల కొలిమి..

జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి.. ఉదయం 8 దాటితే చాలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం రోడ్లపై కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. వేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యిదంటే ఎండ తీవ్రత ఎలా ఉందో తెలుసుకోవచ్చు. వైద్యులు కూడా అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. - అక్షరటుడే, ఇందూరు

# తరుగు పేరిట దోపిడీ

ధాన్యాన్ని విక్రయించేందుకు ఒకవైపు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు తరుగు పేరిట కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీతో ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ పెంచాలని పలుచోట్ల రైతులు రోడ్డెక్కుతున్నా ప్రయోజనం ఉండట్లేదు. కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీకి చెక్ పెట్టాలని వేడుకుంటున్నారు. - అక్షరటుడే, ఎల్లారెడ్డి

- ఉమ్మడి జిల్లాలో మాయాజాలం
- రోడ్డెక్కుతున్న అన్నదాతలు



ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కాగా.. ధాన్యం తూకం వేసిన వెంటనే తరుగు పేరిట కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు మాయాజాలం చేస్తున్నారు. ఫలితంగా ఒక్కో క్వింటాకు 3 కిలోల వరకు నష్టపోతున్నారు. సగటున ఒక లారీ ధాన్యం నుంచి సుమారు 8 నుంచి 11 క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని తరుగు పేరుతో దోచుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఇదే విషయమై రైతులు నిరసన తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలోనూ అన్నదాతలు ఆందోళన చేపట్టారు. కేంద్రాల నిర్వాహకులను హెచ్చరిస్తున్నప్పటికీ.. నిర్వాహకుల తీరు మారట్లేదు.

### నాగిరెడ్డిపేటలో రాస్తారోకో

నాగిరెడ్డిపేట మండలం కేంద్రంలో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు.తరుగు పేరుతో లారీకి 11 క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని తగ్గిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున రైతులు అక్కడికి చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. కాగా.. ప్రతిఏడాది ఇదేతంతు జరుగుతోందని, మిల్లర్లు నిలువునా మోసగిస్తున్నా ఎవరూ పట్టించుకోవట్లేదని రైతులు వాపోతున్నారు.

## సమస్యల పరిష్కారానికే 'భూభారతి'



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, బాన్సువాడ:** భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం 'భూభారతి' చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం బీర్కూరు రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అనుభవదారులు, పట్టదారుల సమస్యలు పరిష్కరించి భూ బదలాయింపునకు చర్యలు చేపడతామన్నారు. ధరణి లోపాలను అధిగమించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ధరణిలో సమస్యలు పరిష్కారం కాక రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, ఇకమీదట అలాంటి సమస్యలు ఉండవని పేర్కొన్నారు. భూభారతితో క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ లత పాల్గొన్నారు.

## కళాశాల దేవాలయంతో సమానం



వేడుకల్లో పాల్గొన్న పోచారం, సురేశ్ షెట్కార్

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనకు దేవాలయంతో సమానమనిఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలో పాల్గొని మాట్లాడారు. ఎస్ఆర్ఎన్‌కే కళాశాలకు ఘనమైన చరిత్ర ఉందని, వేలాది మంది ఇక్కడ చదివి ఉన్నత స్థానాల్లో కొలువులు సాధించారని గుర్తు చేశారు. అనంతరం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఉన్నత విద్యామండలి కమిషనర్ దేవసేన, జైళ్ల శాఖ ఐజీ మురళి బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడారు. అంతకుముందు జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ, బోధన్ సబ్ కలెక్టర్లు కిరణ్మయి, వికాస్ మహతో, కాసుల బాలరాజ్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్ స్వామి, స్థల దాత మనవడు రోహిత్ కేడియా పాల్గొన్నారు.

## వరంగల్ సభతో కాంగ్రెస్ పతనం ప్రారంభం

**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** వరంగల్ సభలో కాంగ్రెస్ సర్కారు పతనం ప్రారంభమవుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'రేవంత్ రెడ్డి గోబ్యాక్, కేసీఆర్ కమ్ బ్యాక్' అనేది ప్రజల మనసుల్లో ఉందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను పాతరేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు చీత్కరించుకుంటున్నారని పేర్కొన్నారు. 27న వరంగల్‌లో జరిగే సభను గులాబీమయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుజీత్ సింగ్, సత్యప్రకాష్, శేఖర్, రాజేశ్వర్ రెడ్డి, వెల్మల్ రాజన్న, మచ్చర్ల సాగర్, మస్త ప్రభాకర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవన్ రెడ్డి

## రామారెడ్డి ఎస్సై సస్పెన్షన్



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడింది. బాధితులకు సంబంధించిన కేసు నమోదుపై నిర్లక్ష్యం వహించిన ఎస్సై నరేష్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిక్రితం ఇసన్నపల్లికి చెందిన ఓ వ్యక్తి మిస్సింగ్ కేసులో ఫిర్యాదుదారు అనేకసార్లు పోలీసులను ఆశ్రయించినా ఎస్సై పట్టించుకోలేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం.. కనీసం ప్రాథమిక విచారణ కూడా చేపట్టకపోవడం ఎస్పీ దృష్టికి రావడంతో కేసును తీవ్రంగా పరిగణించారు. ఈ విషయమై ఐజీకి నివేదిక పంపడంతో సస్పెండ్ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

## సమస్యల పరిష్కారానికి హెల్ప్ సెంటర్

**అక్షరటుడే, ఇందూరు:** ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఓటేసి గెలిపించిన వారందరికీ అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ.. జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వక్ఫ్ బోర్డ్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు తీశారని.. కానీ తీవ్రవాదుల కాల్పులకు మాత్రం ఇప్పటికీ నివాళులర్పించకపోవడం సిగ్గుచేటన్నారు. న్యాలం రాజు, మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కొమురయ్య

## 27న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని మోడల్ స్కూల్లో 2025- 26 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు ఈనెల 27న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## 'కిట్స్'లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా కొనసాగుతున్న 'స్మార్ట్ ఐటీ సిస్టమ్స్' ట్రైనింగ్ ప్రోగ్రాం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వ కుమార్ రాజా మాట్లాడుతూ.. ఇలాంటి ప్రాజెక్టుల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. పరిశోధనపై ఆసక్తి కలుగుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయి రెడ్డి, ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

- అక్షరటుడే ఇందూరు



## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుడు వినయ్‌రెడ్డికి పరిపాటిగా మారిందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాకేశ్‌రెడ్డి చొరవతోనే ఆర్మూర్‌కు సమీకృత గురుకులం మంజూరైందని, ఈ విషయం అసెంబ్లీలో సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఇకనైనా, అనవసర వ్యాఖ్యలు మాను కోవాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ రాజు, పట్టణ అధ్యక్షుడు బాలు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు వినోద్, గిరీష్, మహేష్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక






**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 21 నుంచి నిర్వహించిన మేజర్ లీగ్ బేస్‌బాల్ ఛాంపియన్ పోటీలు ముగిశాయి. ఫైనల్స్‌లో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ పాఠశాల సిరికొండ), జెడ్పీహెచ్ఎస్ తొర్లికొండ జట్టుపై విజయం సాధించింది. ఈ మేరకు విజేతలకు ఎంఎల్‌బీ కప్ ఇండియా హెడ్ ఇన్‌ఛార్జి మిస్టర్ రియో చేతుల మీదుగా ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతగా నిలిచిన నిజామాబాద్ పైరేట్స్ జట్టు జూన్ మొదటివారంలో బెంగళూరులో జరిగే జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా కప్ -2025 పోటీలకు ఎంపికైనట్లు మేనేజర్ సంకీర్త్ శెట్టి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పుప్పాల లక్ష్మీనర్సయ్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్ గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ఫిజికల్ డైరెక్టర్లు నవీన్, సుజాత, లక్ష్మి , కోచ్‌లు అనిల్, నరేష్, అనికేత్ మౌనిక, సంతోష్, నరేన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## డబ్బులు అడిగినందుకు దాడి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని హాజీపూర్ కట్టకింద గ్రామానికి చెందిన మాలోత్ గురునాథ్, ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన మలావత్ సోమేశ్వర్ పొలంలో కేజీవీల్ పనిచేశాడు. అయితే, ఆ డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ నెల 23న సోమేశ్వర్ తన పొలంలో మిషన్ ద్వారా వరి కోయించనున్నాడని తెలుసుకున్న గురునాథ్, తనకు బాకీ డబ్బులు చెల్లిస్తేనే కోత పని చేయాలని మిషన్ డ్రైవర్‌కు సూచించాడు. దీంతో ఆగ్రహించిన సోమేశ్వర్, గురునాథ్ ఇంటికి వెళ్లి దాడి చేశాడు. గురునాథ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

## సలాబత్‌పూర్ ఆలయ హుండీ లెక్కింపు



**అక్షరటుడే, బిచ్కుంద:** మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ హుండీని గురువారం లెక్కించారు. ఆలయ ఛైర్మన్ రాంపటేల్, సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. హుండీ ద్వారా రూ.5,09,370 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రామారావు, ఆలయ ఈవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వివిధ పార్టీల నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కశ్మీర్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు. కేంద్రం తక్షణమే ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అహల్యాబాయి చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి




ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

**అక్షరటుడే, ఇందూరు:** అహల్యాబాయి, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణీరుద్రమ లాంటి వీరవనితల చరిత్రను మహిళా సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం అహల్యాబాయ్ హోల్కర్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక సేవారంగంలో మహిళలను చైతన్యం చేయడంలో అహల్య దేవి చేసిన సేవలు మరువలేనివన్నారు. వందలాది దేవాలయాలు, ధర్మశాలలను కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణ, మరమ్మతులకు ఆమె కృషి చేశారని గుర్తుచేశారు. మహిళా రక్షణ దళాలు ఏర్పాటు చేసిన వీరవనిత అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హనుమంతరావు, సురేష్, డీఈవో అశోక్, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, బద్రీనాథ్, ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ రేంజర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న బాపురాజు(45)కు రోజూ కల్లు తాగే అలవాటు ఉంది. అయితే కల్లు తాగడం ఎక్కువైతే అతని స్నేహితులు ఇంటి వద్ద వదిలేసి వెళ్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి కూడా కల్లు ఎక్కువవడంతో స్నేహితులు ఇంటివద్ద వదిలేసి వెళ్లినట్లు తెలిసింది. ఉన్నఫలంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి ఒంటిపై గాయాలవడంతో ఎవరైనా దాడి చేశారేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎక్లాస్‌పూర్‌లో డీపీవో విచారణ



**అక్షరటుడే, కోటగిరి:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో డీపీవో శ్రీనివాస్ రావు విచారణ చేపట్టారు. గ్రామంలో డ్రెయినేజీలను శుభ్రం చేయట్లేదని, తాగునీటి సమస్యలను కార్యదర్శి పట్టించుకోవట్లేదని పేర్కొంటూ గ్రామస్థుడు శంకర్ పటేల్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం డీపీవో గ్రామానికి వచ్చి విచారణ చేశారు. ఆయన వెంట డీఎల్పీవో నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో చందర్ తదితరులున్నారు.

## అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచిన వ్యక్తికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచిన వ్యక్తికి న్యాయస్థానం జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మాలపల్లిలో అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచిన మక్సూద్‌ఖాన్‌ను సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఎస్సై చెప్పారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ..

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ఘటన కామా రెడ్డి మండలం శాబ్దిపూర్ శివారులోని జాతీయ రహదారి పై బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు వెళ్తున్న లారీ శాబ్దిపూర్ శివారులో మేఘన హెటల్ వద్ద పార్కింగ్ చేశారు. అయితే వెనక నుంచి వచ్చిన లారీ పార్క్ చేసిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీకొన్న లారీ క్యాబిన్ నుజ్జు నుజ్జయింది. దాంతో డ్రైవర్ రాములు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. హైవే పెట్రోలింగ్ ఎస్సై నర్సింలు, సిబ్బంది సదయ్య, హుసేన్ ఘట నాస్థలికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కున్న రాములును సురక్షితంగా బయటకు తీశారు. స్వల్ప గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## ఏడాది క్రితం హత్య.. ఆలస్యంగా వెలుగులోకి..

**అక్షరటుడే, కామారెడ్డి:** అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడనే నెపంతో ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిందో భార్య. ఈ ఘటన ఏడాది క్రితం జరగగా తాజాగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ.. మాజీ సర్పంచ్ భర్తతో అక్రమ సంబంధం ఉంది. ఈ విషయం తెలిసిన భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అయితే ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకుండా ఉండేందుకు తన భర్త విదేశాలకు వెళ్లాడని నమ్మించి ఈ సంబంధాన్ని కొనసాగించింది. కానీ ఎప్పుడైనా తన విషయం బయటకు వస్తుందేమోననే భయంతో ప్రియుడు, మరొక వ్యక్తితో భర్తను హత్యచేసి ధర్పల్లి మండల డొంకల్ తండా శివారులో పాతిపెట్టింది. అప్పటి నుంచి ఈ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డారు. అయితే మృతుడి సోదరుడికి అనుమానం వచ్చి మృతుడి భార్యను ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు స్పందించకపోవడంతో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి తెలిపిన సమాచారం ప్రకారం.. హత్యచేసి పాతిపెట్టినట్టుగా గుర్తించిన పోలీసులు గురువారం డిచ్‌పల్లి పోలీసుల సహకారంతో డొంకల్ తండా శివారులో తవ్వించగా మృతదేహానికి సంబంధించిన అస్థిపంజరం దొరికింది. అయితే హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశాలున్నాయని సమాచారం.



ఆర్మూర్ మండలంలో గేదెకు టీకా వేస్తున్న వైద్యులు



లింగంపేట మండల కేంద్రంలో..

# పశువులకు టీకాలు వేయాలి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఆర్మూర్, లింగంపేట, జుక్కల్‌తో పాటు వివిధ మండలాల్లో వైద్యులు పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. -అక్షరటుడే, నెట్‌వర్క్**



జుక్కల్ మండలంలో..

## అమరవీరుల స్ఫూర్తితో మేడే




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

**అక్షరటుడే, ఇందూరు:** అమరవీరుల స్ఫూర్తితో మేడే నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1886లో అమెరికా చికాగోలో వేలాదిమంది కార్మికులు 8 గంటల పని అమలు చేయాలని పోరాటం చేస్తుంటే అక్కడి ప్రభుత్వం లాఠీఛార్జీ చేసి కాల్పులు జరిపిందని గుర్తుచేశారు. ఈ ఘటనలో వందలాది మంది ప్రాణాలను కోల్పోయారని వారి స్ఫూర్తితో అనేక చట్టాలను సాధించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు అంజలి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నియామకాలపై విచారణ జరపాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విభాగంలో జరిగిన అక్రమ నియామకాలపై విచారణ జరిపించాలని విద్యార్థి నాయకులు ఎమ్మెల్యే కేవీఆర్‌ను కోరారు. ఈ మేరకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో బాధిత అభ్యర్థులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమాలపై ఎలాంటి విచారణ జరపలేదన్నారు. తమకు ఆధారాలు చూడకుండా.. నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని ప్రిన్సిపాల్ చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగ నియామకాల అవినీతిపై సరైన విచారణ చేయకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అవినీతి, అన్యాయం జరిగిందని రుజువులు ఉన్నాయని వివరించారు. ఉద్యోగం పొందిన వారందరి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు బహిరంగంగా చూపించి, అప్పుడు ఉద్యోగాల్లో ఎలాంటి అవినీతి జరగలేదని నిరూపించాలన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాగరాజు, రవి, అరవింద్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సామాజిక ఆర్థిక సర్వే

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణాల్లో వార్డులను చిన్నచిన్న భాగాలుగా విభజించి సర్వే చేసి డేటాను ప్రభుత్వానికి అందిస్తామని సర్వే సూపర్‌వైజర్లు కైలాష్, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ గణాంక కార్యాలయం, నిజామాబాద్ బృందం ఆధ్వర్యంలో బాన్సువాడలో సర్వే జరుగుతోందన్నారు. ప్రతి వార్డులోని విభిన్న ప్రాంతాల జనాభా, జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలను సర్వేలో నమోదు చేస్తామన్నారు. సర్వేలో ఎన్యూమరేటర్లుగా సాగర్, ప్రశాంత్, రాహుల్ పాల్గొన్నారు.



సామాజిక ఆర్థిక సర్వే చేస్తున్న సిబ్బంది

## స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపేట మండలకేంద్రానికి చెందిన తస్నీమ్ ఫాతిమా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించింది. కామారెడ్డిలోని ఆర్యభట్ట ఒకేషనల్ కళాశాలలో ఫిజియోథెరపీ ఫస్టియర్ చదువుతున్న తస్నీమ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడంతో, కళాశాల ఛైర్మన్ కేశిరెడ్డి గురువేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ హనుమంతరావు, డైరెక్టర్ సత్యనారాయణ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జావీద్, బాబర్, సయ్యద్, విష్ణు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి వీడ్కోలు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా కోర్టులో బదిలీ అయిన న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న లాల్‌సింగ్ శ్రీనివాస్ బదిలీపై మంచిర్యాలకు వెళ్తున్న సందర్భంగా ఆయనకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్, డీఎల్ఎస్ఏ ఛైర్మన్ నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, ప్రధాన కార్యదర్శి బందారి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళి, జాయింట్ సెక్రెటరీ మోహన్, కోశాధికారి వేణుప్రసాద్, లైబ్రరీ సెక్రెటరీ రజనీకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని రేపల్లెవాడలో కుమ్మరి పెద్ద నాగయ్యకు చెందిన పూరి గుడిసె ఇటీవల దగ్ధమైంది. దీంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే దుస్తులు, దుప్పట్లు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లి ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సాయిరాం, కాంగ్రెస్ నాయకుడు యాదయ్య, మాజీ జెడ్పీటీసీ సామేల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ సాయిలు, డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి, తదితరులున్నారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహనలో భాగంగా మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జనజాగరణ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు పోలీస్ రాజుపటేల్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణపై వివిధ రాజకీయపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని, సరైన అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, యాదయ్య, సాయిబాబా, రాములు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులు గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రం కావడంతో కార్మికులు జాగ్రత్తగా పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.








## ఉత్సాహంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రోగ్రామ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్ రాకేష్, సీనియర్ అధ్యాపకులు రాకేష్ గౌడ్, అర్చన, శ్రీధర్ బట్టు, రజినీకాంత్, అరవింద్, ప్రమోద్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.